www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 07 | జూలై | 2026
పేజీలు : 8

## నేటి నుంచి సిపిఐ రాజకీయ సైద్ధాంతిక శిక్షణ

- ప్రారంభించనున్న సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ
- హాజరుకానున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధులు

సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా



**ప్రజాపక్షం/భద్రాచలం :** నేటి నుండి మూడు రోజులుపాటు భద్రాచలం కేంద్రంగా సిపిఐ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా తెలిపారు. శిక్షణ తరగతుల ఏర్పాట్ల పర్యవేక్షణకు విచ్చేసిన ఆయన మాట్లాడుతూ సమకాలీన రాజకీయ అంశాలపై ప్రముఖులు ఇందులో విస్తృత బోధన చేయనున్నారని తెలిపారు. ఈ నెల 7, 8 తేదీల్లో గోదావరి కరకట్ట సమీపంలోని కమ్మ సత్రంలో, 9వ తేదీన రాఘవ నిలయం రెడ్ల సత్రంలో జరిగే శిక్షణా తరగతులతో పార్టీ సిద్ధాంత పరిపుష్టి, బలోపేతం

మిగతా 2లో..

# వరపటి కాలమే..!




- ఖరీఫ్‌కు వరుణుడి దెబ్బ
- ప్రత్యామ్నాయ పంటల వైపు రైతుల దృష్టి ఏదీ...?

**ప్రజాపక్షం/ఖమ్మం :** వర్షాకాలం, పునాస పంటలకు ఈ ఏడాది వాతావరణం అంత అనుకూలంగా లేదు. వాతావరణ పరిస్థితులను గమనిస్తుంటే వరపటి కాలమేనని పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. మృగశిరలోనే ముల్లు మెత్తబడుతుందంటారు ఈ ఏడాది మృగశిర ఆరుద్ర కార్తెలలో కూడా సరైన వర్షం పడలేదు. పునర్వసు కార్తె ప్రారంభమైన వర్షం కురిసే పరిస్థితి కనిపించడం లేదు. ఆకాశం మేఘావృతమై ఉండటం, ఎప్పుడో ఒకసారి నాలుగు చినుకులు రాలటం మినహా ఇంత వరకు దుక్కులు పొర్లే వర్షం కురవలేదు. భారీ మధ్యతరహా ప్రాజెక్టులే కాదు వాగులు, వంకలలో నీరు చేరలేదు. వరి సాగు ఈసారి ఖరీఫ్‌లో సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. మెట్ట పంటల సాగు కూడా అత్తు బిత్తుగానే ఉంది. సాంప్రదాయ పంటలైన పత్తి, మిర్చి, అపరాల పంట

మిగతా 2లో..

# నిబంధనలకు పాతర..?






- అటవీశాఖలో గతితప్పిన నిర్ణయాలు
- అధికారుల అండతో అక్రమాల పరంపర..?

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టీజీఎఫ్‌డీసీ) సత్తుపల్లి డివిజన్‌లో నిబంధనలను తుంగలో తొక్కుతూ అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు తీవ్రస్థాయిలో వినిపిస్తున్నాయి. ప్లాంటేషన్ పనుల కేటాయింపుల నుంచి కూలీల భద్రత, కలప రవాణా, బిల్లుల చెల్లింపులు, పర్యావరణ పరిరక్షణ వరకు పలు అంశాల్లో తీవ్రమైన అవకతవకలు చోటు చేసుకున్నాయని స్థానికులు, కాంట్రాక్టర్లు, కూలీలు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారాలపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు, విజిలెన్స్ విభాగం సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

### ఒకే కాంట్రాక్టర్‌కు భారీ పనుల కేటాయింపా..?

సుమారు 1,300 ఎకరాల ప్లవింగ్ పనులను ఒకే కాంట్రాక్టర్‌కు తొమ్మిది కాంట్రాక్టుల రూపంలో అప్పగించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కాంట్రాక్ట్ టెండర్లలో అవకతవకలు జరిగాయని గుసగుసలున్నాయి. ఇన్స్యూరెన్స్ కాలం చెల్లినా,

మిగతా 2లో..

# సారూ.. ఇది కూడా బడే..!

- పశువుల కొట్టం అనుకుంటే పొరపాటే





**ప్రజాపక్షం/గుండాల :** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తాం, నాణ్యమైన విద్యను నిరుపేద విద్యార్థులకు అందిస్తామని చెప్పడం మాటల్లోనే తప్ప చేతల్లో కాదని చెప్పడానికి ఈ పాఠశాలే ఒక ఉదాహరణ. 25 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్న ఈ పాఠశాలకు ఒక గది కూడా లేదంటే ఆశ్చర్యం కలుగక మానదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండల పరిధిలోని సాయనపల్లి పంచాయతీ పరిధిలోని మల్లెలవారి గుంపులో గతేడాది ప్రాథమిక పాఠశాలను ప్రారంభించారు. ఈ గిరిజన గ్రామంలో 25 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.ఈ పాఠశాల ప్రారంభం కాక ముందు రెండు కిలో మీటర్ల దూరంలో గల వెంకటాపురం పాఠశాలకు వెళ్లాల్సి వచ్చేది. రెండు గ్రామాల మధ్య వాగు ఉండడంతో వర్షాకాలం పాఠశాలకు వెళ్లే పరిస్థితి లేదు. దీనిని దృష్టిలో ఉంచుకుని మల్లెలవారి గుంపులో ప్రత్యామ్నాయ పాఠశాలను ఏర్పాటు చేశారు. ఒక పాకలో ఈ పాఠశాలను ప్రారంభించారు. ఈ ఏడాది పడిన ఒకట్రెండు వర్షాలు, గాలి దుమారాలకు పైకప్పు లేచిపోయింది. గ్రామస్తులు టార్పాలిన్లు వేసి చుట్టూ పరదాలతో విద్యార్థులు వర్షానికి తడవకుండా ఏర్పాట్లు చేశారు. పశువుల పాకను తలపించే రీతిలో ఉన్న ఈ చిన్న పూరీపాకలో 25 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండగా ఒక ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారు. మైదాన ప్రాంతాల్లో ఇద్దరు విద్యార్థులకు, ఒక విద్యార్థికి ఇద్దరు ముగ్గురు ఉపాధ్యాయులు ఉంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఈ 25 మంది విద్యార్థులు ఉన్న చోట ఏకోపాధ్యాయ పాఠశాలను నిర్వహించడం సహేతుకం కాదని గిరిజనులు వాపోతున్నారు. ఇక్కడ

మిగతా 2లో..

## ప్రజలకు మెరుగైన పోలీసు సేవలందించడమే లక్ష్యం

డీజీపీ సి.వి. ఆనంద్



**ప్రజాపక్షం/మణుగూరు :** జిల్లాలో శాంతిభద్రతలను మరింత పటిష్టం చేయడంతో పాటు ప్రజలకు ఆధునిక సౌకర్యాలతో కూడిన మెరుగైన పోలీసు సేవలు అందించాలనే లక్ష్యంతో మణుగూరులో నూతనంగా నిర్మించిన

మిగతా 2లో..

## ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి

- ప్రభుత్వ విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయాలి
- ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం ముట్టడి

3లో



# వరపటి కాలమే..!

(మొదటిపేజీ తరువాయి) లకు సాగుకు అంత అనుకూలంగా లేకపో వడంతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టిసారించాలని అధికారులు సూచిస్తున్నారు.

**ఏదీ ప్రత్యామ్నాయం :**

వ్యవసాయ శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు వాతావరణ పరిస్థితు లను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచిస్తున్నారు. సాధారణంగా ఖరీఫ్‌లో వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, అపరాల పంటలను రైతులు సాగు చేస్తారు. వీరికి ప్రత్యామ్నాయం ఏమి టన్నది అధికారులు వివరించ లేదు. వరి పంట భూముల్లో వరి తప్ప ప్రత్యామ్నాయ పంటలను సాగు చేడయం సాధ్యం కాదు. పత్తి, మిర్చి, మొక్కజొన్న సాగుతో పోల్చి చూసినప్పుడు వరి అంత లాభసాటి పంట కాకపోవడంతో ఇప్పటికే మెట్ట పంటలకు సానుకూలంగా ఉన్న మాగాణి భూములను మెట్ట భూములుగా మార్చి వేశారు. ఇక పత్తి, మిర్చి లాంటి వాణిజ్య పంటలకు ప్రత్యామ్నాయం కనిపించడం లేదు. ఒకప్పుడు ఆహార పంటగా చెప్పుకునే మొక్కజొన్న ఇప్పుడు వాణిజ్య పంటగానే రైతులు భావిస్తున్నారు. వాణిజ్య పంటల స్థానంలో అపరాల పంటలను సాగు చేసి నష్టపోయేందుకు రైతులు సిద్ధంగా లేరు. దశాబ్ద కాలంగా అతివృష్టి అనావృష్టి కారణంగా అపరాల పంట చేతికి వచ్చిన దాఖలాలు లేవు.

**ఉద్యానవన పంటల సాగు :**


ఉద్యానవన పంటలకు సంబంధించి అనువైన భూములు ఉండి నీటి వసతి గల చోట పామాయిల్ సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. దేశీయ అవసరాల రీత్యాల పామాయిల్‌కు ఉన్న డిమాండ్, ప్రభుత్వ పోత్సాహం వెరసి పామాయిల్ సాగు పెరిగేందుకు కారణమవుతుంది. మామిడి, నిమ్మ, జామ లాంటి ఇతర తోటల సాగుపై రైతులు అంతగా ఆసక్తి చూపడం లేదు. పామాయిల్‌కు భవిష్యత్తు ఉంటుందన్న నమ్మకమే పామాయిల్ సాగు విస్తరణ పెరిగేందుకు కారణమవుతుంది. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగుకు రైతులను సమాయత్తం చేయడంలో కొంత వైఫల్యం కనపడుతుంది. స్వల్ప కాలిక పంటలకు దీర్ఘకాలిక పంటలు మాత్రమే ప్రత్యామ్నాయం కాకుండా తిరిగి స్వల్పకాలిక పంటలనే ప్రత్యామ్నాయంగా చూపి సాగు చేయిస్తే ఫలితాలు ఉండవచ్చు.

# నిబంధనలకు పాతర..?







(మొదటిపేజీ తరువాయి)

కాంట్రాక్టర్ కు పనులు గత రెండు నెలల క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కత్తిపూడి గ్రామం నుండి జామాయిల్ కటింగ్ పనులు నిమిత్తం కూలీలను కాంట్రాక్టర్ తీసుకువ చ్చారు. పనిచేసే ప్రతి కూలీకి ప్రమాద బీమా తప్పనిసరి అయినప్పటికీ, బీమా గడువు ముగిసిన తర్వాత కూడా దానిని పునరుద్ధరిం చకుండా పనులకు అనుమతులు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదే నిర్లక్ష్యం కార ణంగా ఒక కూలీ విధి నిర్వహణలో మృతి చెందినప్పటికీ, అతని కుటుంబానికి రావా ల్సిన పరిహారం అందలేదని విమర్శలు వ్యక్త మవుతున్నాయి. కూలీ మృతి చెందిన తర్వాత కూడా సంబంధిత అధికా రులు బాధిత కుటుంబాన్ని పరామర్శించకపోవడం, బాధ్యత వహించక పోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది. బీమా లేకుండా పనులకు అను మతి ఇచ్చిన అధికారులపై విజిలెన్స్ విచారణ జరిపి చర్యలు తీసుకోవా లని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**కలప రవాణాలో నిబంధనల ఉల్లంఘనలేనా..?**

కార్పొరేషన్‌కు చెందిన కలప అక్రమంగా తరలింపుకు గురవుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.నిబంధనలకు విరుద్ధంగా రవాణా పర్మిట్లు జారీ చేస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. అర్ధరాత్రి వేళల్లో కార్పొ రేషన్ ప్రాంతాల నుంచి కలప తరలింపులు జరుగుతున్నాయనే అను మానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా కార్పొరేషన్ లోడింగ్ జ రిగిన ప్రదేశంలోనే పర్మిట్లు జారీ చేయాల్సి ఉన్నప్పటికీ, లారీలు లో డింగ్ చేసుకొని సుమారు 5 నుండి 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న వే బ్రి డ్జి వద్దకు వచ్చిన అనంతరమే పర్మిట్లను జారీ చేస్తున్నారనే అరోపణ లు వినిపిస్తున్నాయి. తేదీలు లేకుండానే పరిమితులు జారీ జరుగుతుందని ఎవరైనా వాహనాన్ని తనిఖీ చేస్తారు అనే అనుమానం కలిగిన చో టనే వాటిపై తేదీలు వేసి పర్మిట్లు జారీ చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

**దీర్ఘకాలంగా ఒకేచోట విధులు.. అవినీతి ఆరోపణలు...**

ఏళ్ల తరబడి ఒకేచోట కొనసాగుతున్న ఓ అధికారి అక్రమ వసూళ్లు, అధికార దుర్వినియోగం, కాంట్రాక్టర్లపై ఒత్తిళ్లు వంటి ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ ఆస్తులపై గుసగుసలు ఉన్నతాదికారి ఒకరు అక్రమ ఆస్తులు భారీగానే కూడబెట్టినట్లు కార్పొరేషన్ లో బహిరంగంగానే చర్చించుకుంటున్నారని, ఆ అధికారి పామాయిల్ తోటలు, వ్యవసాయ భూములు, జిల్లా కేంద్రంతో పాటు వివిధ చోట్ల విలాసవంతమైన ఇళ్లు, భారీ మొత్తంలో ఆస్తులు కూడబెట్టారనే ప్రచారం స్థానికంగా జరుగుతోంది.

**పర్యావరణానికి ముప్పు.....**

నూతన ప్లాంటేషన్ కోసం సిద్ధం చేసే సమయంలో ప్లాంటేషన్ ప్రాంతాల్లో విలువైన చెట్లను గుర్తించకుండా నరికివేయడం జరుగుతుం దని, కలప వ్యర్థాలను దూరంగా తరలించాల్సి ఉన్నప్పటికి నిబంధన లకు విరుద్ధంగా నిప్పంటించి దట్టమైన పొగతో కార్పొరేషన్ ను కలు షితం చేస్తున్నారని పర్యావరణ ప్రేమికులు వాపోతున్నారు. సత్తుపల్లి డివిజన్‌లోని కార్పొరేషన్ లో జరుగుతున్న పనులు, అధికారుల ఇష్టా రాజ్యం, నిబంధనలకు పాతర తదితర వ్యవహారాలపై ప్రభుత్వం, కార్పొరేషన్ ఉన్నతాధికారులు, విజిలెన్స్, అవినీతి నిరోధక శాఖ (ఏ సీబీ) సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఆరోపణల్లో నిజానిజాలు తేల్చి, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుని కార్పొ రేషన్‌లో పారదర్శకతను నెలకొల్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విష యాలపై డివిజన్ మేనేజర్ చంద్రమోహన్ ను వివరణ కోరగా వ్యర్థాలకు నిప్పుపెడుతున్నట్లైతే చూసి అవసరమైతే కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇస్తాం అని, ఇప్పుడే కార్పొరేషన్ ను ప్రక్షాళన చేస్తున్నామని, అర్ధరాత్రి కలప తరలితే సమాచారం అందిస్తే వస్తామని, నిబంధనలను విరు ద్ధంగా ఏమీ లేదని అంతా సవ్యంగానే జరుగుతుందని తెలిపారు. కార్పొ రేషన్ లోని జామాయిల్ ప్లాంటేషన్ లో రాత్రి 9 గంటల సమయంలో లోడింగ్ జరగటం, లోడ్ అయిన వాహనానికి పర్మిట్ లేకపోవటం, పర్మిట్ ఉందా అని ప్రశ్నిస్తే అధికారులు తెస్తారని ఇంకా రాలేదని చెప్పటం, ఈ సందర్భంలో డిఎం ని చరవాణిలో పలుమార్లు సంప్రదిం చిన ఫోన్ లిఫ్ట్ చేయకపోవటం పలు అనుమానాలకు తావిస్తుంది.

# సిపిఐ సభ్యురాలు ముత్తమ్మ మృతి

**- నివాళులర్పించిన బాగం, దండి**



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురం మున్సిపా లిటీ పరిధిలోని 31వ వార్డుకు చెందిన మేళ్లచెర్వు ముత్తమ్మ(50) అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంత్‌రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ భౌతికకాయాన్ని సందర్శించి ఎర్రజెండాను కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతురాలికి భర్త, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇందులో పెద్ద కుమార్తె మేళ్లచెర్వు లలిత ఎంపీపీగా పనిచేయడంతో పాటు ప్రస్తుతం సిపిఐ అనుబంధ సంఘమైన మహిళా సమాఖ్య మండల కార్యదర్శిగా కొనసాగుతున్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మిడకంటి చిన్న వెంకటరెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, 28వ వార్డు సిపిఐ కౌన్సిలర్ దండి రంగారావు, మండల సమితి సభ్యులు మిడకంటి పెద్ద వెంకట్‌రెడ్డి, వెన్నం భాస్కర్, మామిడి సుదర్శన్‌రెడ్డి, మేళ్లచెర్వు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి సిపిఐ రాజకీయ సైద్ధాంతిక శిక్షణ

(మొదటిపేజీ తరువాయి) సాధ్యమవుతుందన్నారు. ఈ ప్రతిష్టాత్మక శిక్షణా తరగతులలో ఇరు జిల్లాల నుంచి సుమారు 300 మంది సమితి సభ్యులకు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ శిక్షణా తరగతులను సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ప్రారంభించనున్నారని, ముఖ్య అతి థిగా సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివ రావు పాల్గొననున్నారని పేర్కొన్నారు. మూడు రోజులపాటు సాగే ఈ తరగతులలో రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, ప్రొఫెసర్ యుగల్ రాయలు, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు మోహన్ రెడ్డి, సోమసుందర్, ఎస్.వేణుగోపాల్, చలసాని వెంకట రామారావు, భాగం హేమం తరావు, వి.మల్లికార్జున్ రావులు పలు ముఖ్యమైన అంశాలపై శ్రేణులకు దిశానిర్దేశం చేస్తార న్నారు. పార్టీ బలోపేతానికి ఎంతో ఉపయోగపడే ఈ శిక్షణా తరగతులను సిపిఐ శ్రేణులు, సమితి సభ్యులు హాజరై విజయవంతం చేయాలని సాబీర్ పాషా పిలుపునిచ్చారు.

# సారూ.. ఇది కూడా బడే..!

(మొదటిపేజీ తరువాయి) ఉపాధ్యాయ సిబ్బందిని నియమించడంతో పాటు పాఠశాలకు పక్కా భవనాన్ని మంజూరు చేయాల్సి ఉంది. అసలే గిరిజన అటవీ ప్రాంతం కావడం నేలపై కూర్చున్న ప్పుడు తేళ్లు, క్రిమికీటకాలు విద్యార్థులను కాటు వేసే ప్రమాదం ఉందని పక్కా భవనాన్ని నిర్మిం చాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ పాఠశాలను సందర్శించి 25 మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేవిధంగా పక్కా భవనాన్ని నిర్మించి ఉపాధ్యాయ సిబ్బందిని ఏర్పాటు చేయాలని మల్లెలవారి గుంపు గిరిజనులు కోరుతున్నారు.

## ప్రజలకు మెరుగైన పోలీసు సేవలందించడమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి) పోలీస్ స్టేషన్‌ను తెలంగాణ రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, పిన పాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా పోలీసు సూపరింటెం డెంట్ రోహిత్ రాజు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, పోలీసు శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీటీవీ మానిటరింగ్ సెల్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ సహకారంతో నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణం పూర్తయిందని, ప్రజలకు మరింత మెరు గైన, వేగవంతమైన పోలీసు సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించ డం జరిగిందన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులు, హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో నేరాల నియంత్రణతో పాటు అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతూ సమర్థవంతంగా చర్యలు తీసుకుంటున్నా మని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా అందించగలు గుతున్నామని డీజీపీ తెలిపారు. జిల్లా కలెక్టర్ అంకిత్ నూతన పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీటీవీ మానిటరింగ్ సెల్‌ను ప్రారంభించి, పోలీస్ స్టేషన్‌లో కల్పించిన ఆధునిక మౌలిక సదుపాయాలను పరిశీలించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు సత్వర, పారదర్శక పోలీసు సేవలందించడంలో జిల్లా యంత్రాంగం పోలీసు శాఖతో సమన్వయంగా పనిచేస్తోందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియో గించడం ద్వారా నేరాల నియంత్రణతో పాటు ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందించే దుకు ఈ నూతన పోలీస్ స్టేషన్ దోహదపడుతుందని పేర్కొన్నారు. అనంతరం డీజీపీ, ప్రజాప్ర తినిధులు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో కలిసి పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ప్రజలకు స్నేహపూర్వక, పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన పోలీసు సేవలు అందించాలని పోలీసు అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీసు శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, సింగరేణి సంస్థ ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ప్రకృతి విపత్తులపై అవగాహన



ప్రజాపక్షం/ ఖమ్మం : ప్రకృతి విపత్తులు ఎదురైన ప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై విద్యా ర్థులకు అవగాహన కల్పించారు. సోమవారం కలె క్టర్ ఆదేశాను సారం ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళా శాలలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ డా।। మహ్మద్ జాకీరుల్లా అధ్యక్షతన ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఎన్‌డిఆర్ఎఫ్ బృందం, వరదలు, భూకంపాల పట్ల విద్యార్థులకు పలు అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ హైదరాబాద్ ప్రాంతీయ ఇన్‌స్పెక్టర్ బల్జీత్ సింగ్ మాట్లాడుతూ వరదలు, భూకం పాలు వచ్చినప్పుడు చాకచక్యంగా వ్యవహరించడం వల్ల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించవచ్చు న్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిపివో అజయ్‌కుమార్, రెస్క్యూ టీమ్ సభ్యులు సందీప్ కుమార్ రెడ్డి, సుధీర్, వైస్ ప్రిన్సిపాల్ డా।। శ్రీనివాస్, ఐక్యూ ఏసి కో ఆర్డినేటర్ డా।। ఎం. సునంద, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డా।। పిచ్చయ్య, డా।। ఎన్‌వి రమణ, ధర్మయ్య, ఎన్‌సిసి కమాండెంట్ డా।। ఓంకార్, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 20వ వార్డులో సర్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో ఆ వార్డు కౌన్సిలర్ వుంద్రు వర లక్ష్మి, శ్యామ్‌బాబు ఆధ్వర్యంలో సర్ కార్యక్రమంపై అవగాహన ర్యాలీని వార్డులో సోమవారం నిర్వహించారు. ఈ అవగాహన ర్యాలీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ సర్ కార్యక్రమంలో ప్రతి ఓటరు వారి ఓటర్ ఫామ్ పూరించేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఫామ్ నింపాలని, అదేవిధంగా వార్డులో బూత్ ఏజెంట్లు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ బొర్ర గంగారావు, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు శఖులం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరు సీతారాములు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు శీలం చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వుంద్రు శ్యామ్‌బాబు, పమ్మి అశోక్, వీరంశెట్టి సీతారాములు, మరికంటి రాజగోపాల్, కంభంపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



**-ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన కలెక్టర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజావాణిలో ప్రజలు సమర్పించే దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డిలతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఖమ్మం నగరం 15వ డివిజన్‌కు చెందిన సయ్యద్ రహమత్ బీ తాను అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నానని సొంత ఇంటి స్థలం కూడా లేదని డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. తిరుమలాయపాలెం మండలానికి చెందిన భానురేఖ ఏఎన్ఎం కోర్సు పూర్తి చేసినప్పటికీ సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ విషయంలో అధికారులు స్పందించడం లేదని దరఖాస్తు చేశారు. నేలకొండపల్లి మండలం రెవెన్యూ గ్రామానికి చెందిన లక్కం వెంకన్న బక్కయ్య శ్రీనివాసులు సర్వే నెం.993లో 23 కుంటలు, 616లో 15 కుంటలు, 1004లో 12 కుంటలు, 1005లో 12 కుంటల భూమి ఉందని సాదాబైనామా కోసం దరఖాస్తు చేసుకున్నా పాసుపుస్తకాలు అందలేదని దరఖాస్తు చేశారు. రఘునాథపాలెం మండలం మంచుకొండ గ్రామానికి చెందిన వంగర రమాదేవి తన కుమార్తెకు కళ్యాణలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసినప్పటికీ మంజూరు కాలేదని దరఖాస్తు చేశారు. ఆయా దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు సత్వరమే అర్హత ఉన్న వాటికి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిసిఈవో దీక్షారైనా, డిఆర్వో సిహెచ్ రామ్మూర్తి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి




**-ప్రభుత్వ విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయాలి**
**-ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం ముట్టడి**





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యార్థుల బోధన రుసుములు, ఉపకార వేతనాల బకాయిలు తక్షణమే మంజూరు చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని, ఖమ్మం జిల్లా కేంద్రంగా ప్రభుత్వ విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం పుర వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. ఫీజు, రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ విద్యార్థి లోకం కదం తొక్కింది. కాకతీయ యూనివర్సిటీ అనుబంధ పీజీ కళాశాల నుంచి వందలాది మంది విద్యార్థులు ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం ముట్టడికి ప్రదర్శనగా వెళ్తున్న విద్యార్థులను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. దీనితో రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మదుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాను ఉద్దేశించి ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ ఐదేండ్లుగా ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు మంజూరు చేయడం లేదన్నారు. ప్రభుత్వం మారిన పాలన మాత్రం అలాగే ఉందన్నారు. విద్యార్థుల పట్ల వివక్ష చూపిన ప్రభుత్వాలు మనుగడ సాగించలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్ నాన్ ప్రొఫెషనల్ రూ.2వేల కోట్లు, ప్రొఫెషనల్ రూ.4వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు పలు మార్లు నిరవధిక బంద్ నిర్వహించినా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. పేద విద్యార్థుల పట్ల ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను కనబరుస్తుందన్నారు. బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సుమారు రూ. 10వేల కోట్లకు పైగా పెండింగ్ బకాయిలు ఉన్నాయన్నారు. తక్షణమే బకాయిలను విడుదల చేయడంతో పాటు ఖమ్మం జిల్లా కేంద్రంగా ప్రభుత్వ విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు షేక్ నాగులమీరా, మనోజ్, జిల్లా నాయకులు పవన్, మనోజ్, సుకుమార్, ఉస్మాన్, ఉపేందర్, గోపి, వెంకట్, నవీన్, చైతన్య పాల్గొన్నారు.


# ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏర్పుల సుధాకర్



**ప్రజాపక్షం/ఏన్కూరు:** తెలంగాణ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శిగా తిమ్మారావుపేటకు చెందిన ఏర్పుల సుధాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పులి లక్ష్మయ్య సోమవారం నియామక ఉత్తర్వుల జారీ చేశారు. ఆరికాయలపాడు పశువైద్యశాలలో సహాయకుడిగా పని చేస్తున్న సుధాకర్, 20ఏళ్లుగా పశువైద్య రంగంలో సేవలందిస్తూ పలు అవార్డులు అందుకున్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

# దారితప్పిన చేయూత..!

**- 2023నుంచి తనగంపాడులో కొనసాగుతున్న నిర్లక్ష్యం**
**- ఓ గ్రామస్థాయి అధికారి పాత్రపై అనుమానాలు**




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** వితంతవుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న చేయూత పింఛన్ పథకం ఓ గ్రామంలో దారితప్పిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఒకటి, రెండు నెలలు కాదు..ఏకంగా మూడేళ్లుగా లబ్ధిదారురాలికి రావాల్సిన పింఛన్ సొమ్ము మరొకరి బ్యాంకు ఖాతాలో జమ అవుతున్నట్లు అధికారుల వెరిఫికేషన్‌లో బైటపడింది. ఖమ్మంరూరల్ మండలం తనగంపాడు గ్రామానికి చెందిన సీతమ్మకు 2023లో ప్రభుత్వం వితంతు పింఛన్ మంజూరు చేసింది. అయితే అప్పటి నుంచి ఆమె ఖాతాలో కాకుండా మరో వ్యక్తి బ్యాంకు ఖాతాలోనే ప్రతి నెలా పింఛన్ జమ అవుతున్నట్లు సమాచారం. దీంతో మూడేళ్లుగా ఆమె ప్రభుత్వ ఆర్థిక సహాయానికి దూరమయ్యారు. ఈ విషయాన్ని బాధితురాలు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తుంది. ఇటీవల చేపట్టిన చేయూత పింఛన్ వెరిఫికేషన్ సందర్భంగా అధికారులు విచారణ జరపగా ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో గతంలో గ్రామంలో విధులు నిర్వహించిన ఓ గ్రామస్థాయి అధికారి నిర్లక్ష్యం లేదా? ప్రమేయం ఉందనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. బ్యాంకు ఖాతా వివరాలు ఎలా మారాయి?ఎవరి ఖాతాలో పింఛన్ జమ అయ్యింది? ఇంకా బాధ్యులెవరు? అనే అంశాలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై ఎంపిడీఓ రవి కుమార్‌ను ప్రజాపక్షం వివరణ కోరగా పరిశీలన చేసి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే బాధితురాలకి న్యాయం జరిగేల చూస్తామన్నారు.

# ఈఓ భవన నిర్మాణానికి వంకుస్థాపన



**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** మండల పరిధిలోని రాయపట్నం గ్రామంలో గ్రామ సర్పంచి కంచం గోపి సోమవారం ఈఓ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సీసీ పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి నరేశ్, వార్డు సభ్యుడు మాగంటి ఏసు, ఈఓ అధ్యక్షురాలు, గ్రామస్తులు రాయుడి భద్రయ్య, ఆశా వర్కర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# 'సర్' హెల్ప్‌డెస్క్‌ను సద్వినియోగం చేసుకోండి



**ప్రజాపక్షం/ముదిగొండ:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ(సర్) దరఖాస్తులు నింపడంలో ఏవైనా సందేహాలు ఉన్న ప్రజలు మండలంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. సందేహాల నివృతికి గాను మండల నోడల్ అధికారి షేక్ జాన్‌పాషాను 80088 66208 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. అర్హులైన ప్రతీ ఓటరు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకుని ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు కావాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# బీఎల్‌ఏల సమస్యలను పరిష్కరిస్తాం



**ప్రజాపక్షం/ముదిగొండ:** ఓటరు నమెదు ప్రక్రియలో ఎదురవుతున్న సాంకేతిక, పరిపాలనా సమస్యలను బీఎల్‌ఏలు తమ దృష్టికి తీసుకొస్తే..కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చూస్తామని జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) అధ్యక్షుడు నూతి సత్యనారాయణ హామీ ఇచ్చారు. ఆదివారం రాత్రి ఓటరు నయోదు ప్రక్రియపై బీఎల్‌ఏలతో సమీక్షా సమావేశం నిర్వహించి, తగు సూచనలు, సలహాలు అందించారు. నమోదు ప్రక్రియ పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు బీఎల్‌ఏలు బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, బీఎల్‌ఏలు పాల్గొన్నారు.

# బాణాపురంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై తనిఖీ



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండల పరిధిలోని బాణాపురం గ్రామంలో సోమవారం నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరామయ్య క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించారు. ఈ మేరకు బీఎల్‌ఏలు మరికంటి వెంకటేశ్వర్లు, ఉన్నం పూర్ణచందర్‌రావు, శీలం శ్రీనివాసరావు, గుండాల వెంకట అప్పయ్యలను ఎదురవుతున్న సమస్యలను, అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి భూక్యా ధర్మనాయక్, సర్పంచి సంధ్యా నాయక్, మాత్కేపల్లి మార్కెట్ డైరెక్టర్ గుండాల వెంకటప్పయ్య, సీనియర్ నాయకులు శీలం శ్రీనివాసరావు, వార్డు సభ్యుడు ఆత్మకూరి ఉదయ్, ఉపేందర్, కనపర్తి పూర్ణచందర్ రావు, బీఎల్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

# రైతులందరికీ యూరియా సరఫరా చేయాలి



**ప్రజాపక్షం/పెనుబల్లి:** రైతులకు అవసరమైన మేరా యూరియాను ఎలాంటి కొరత లేకుండా సరఫరా చేయాలని, పాత పద్ధతిలోనే యూరియా పంపిణీ కొనసాగించాలని సిపిఎం మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రామచంద్ర రావు బంజర్ గ్రామంలో సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు ఫెర్టిలైజర్ యాప్ కారణంగా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే ఆ విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. వ్యవసాయ పనులు కీలక దశలో ఉన్న సమయంలో యూరియా కొరత ఏర్పడితే రైతులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. యాప్‌లో సాంకేతిక సమస్యలు, నెట్‌వర్క్ అంతరాయాల కారణంగా రైతులు గంటల తరబడి ఎరువుల దుకాణాల వద్ద వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ప్రయోజనాలను విస్మరిస్తే సిపిఎం పార్టీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు తడికమళ్ళ చిరంజీవి ఖండేసత్యం మరియు టి సునీత రాణి, అయినంపూడి లావణ్య, సింగి సాల తిరపయ్య, మరకాల వెంకన్న, గామాస హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మైనింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలి




**ప్రజాపక్షం/ఇల్లందు:** మైనింగ్ సర్దార్‌లకు ఓవర్‌మేన్ ప్రమోషన్లు ఇవ్వాలని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు జనరల్ మేనేజర్ వీసం కృష్ణయ్యకు సోమవారం వినతి పత్రం అందజేశారు. డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె సారయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎండి నజీర్ అహ్మద్ మాట్లాడుతూ 2016, 17 బ్యాచ్ సీనియర్ మైనింగ్ సర్దార్‌లు అర్హత ఉన్నప్పటికీ ఖాళీలు లేవనే కారణంలో ప్రమోషన్లు నిలిపివేయడం అన్యాయమని పేర్కొన్నారు. అర్హులకు తక్షణమే ఓవర్‌మేన్ గ్రేడ్ బి ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో వంశీ కృష్ణ, ప్రసన్న కుమార్, అజీమ్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## వ్యాధుల నివారణపై అవగాహన అవసరం



**ప్రజాపక్షం/పినపాక:** ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పినపాక మండలం ఈ బయ్యారం గ్రామంలో తెలంగాణ పశుసం వర్ధక శాఖ ఆధ్వర్యంలో పెంపుడు జంతువులకు ప్రత్యేక వ్యాక్సినేషన్ శిబిరం నిర్వహించినట్లు వెటర్నరీ డాక్టర్ ఉజ్వల తెలిపారు. జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే రేబీస్, లెప్టోస్పిరోసిస్, బ్రూసెల్లోసిస్, టిబి, సాల్మొనెల్లోసిస్, టాక్సోప్లాస్మోసిస్, ఆంత్రాక్స్, బర్డ్‌ఫ్లూ వంటి వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చేతులు శుభ్రంగా కడుక్కోవడం, శుద్ధమైన నీరు తాగడం, మాంసం, గుడ్లను బాగా ఉడికించి తినడం, పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించడం వంటి జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఒకే ఆరోగ్యం, ఒకే లక్ష్యం నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ వాగబోయిన చందర్‌రావు, ఉప సర్పంచ్ సందీప్‌రెడ్డి, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి సర్వే చేయాలి



**ప్రజాపక్షం/ఇల్లందు:** మామిడి గుండాల సీలింగ్ భూములను సర్వే చేసి డివిజన్ చేయాలని, 60 ఏళ్లుగా సాగుచేస్తున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని ఇల్లందు మామిడి గుండాల భూ పరిరక్షణ కమిటీ(అఖిలపక్షం) ఆర్డీఓ బి మధుకు వినతి పత్రం అందజేసింది. పట్టాలు ఉన్న రైతులకు భూమి హక్కులు కొనసాగించాలని, భూదాన భూముల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వారు కోరారు. స్పందించిన ఆర్డీఓ వారం రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు అబ్దుల్ నబీ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆవునూరి మధు, సీపీఐ నాయకులు బొప్పిశెట్టి సత్యనారాయణ, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆర్‌ఎస్ బోస్, ప్రజాఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు రామటెంకి అశోక్, తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు దుగ్గారపు వీరభద్రంతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి మంగళ, శుక్రవారాలు డ్రైడే



**ప్రజాపక్షం/ఇల్లందు:** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వర్షాకాల సీజన్ వ్యాధుల నివారణ కోసం ప్రతి మంగళవారం, శుక్రవారం అన్ని గ్రామ పంచాయితీలో డ్రైడే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇల్లందు ఎంఎల్‌పి కోరం కనకయ్య పిలుపునిచ్చారు. సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో నిల్వ నీటి తొలగింపు దోమల ఉత్పత్తి కేంద్రాల నిర్మూలన, పారిశుద్ధ్య చర్యలు, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈకార్యక్రమానికి ప్రజలు, మీడియా ప్రతినిధులు సహకరించి సీజన్ వ్యాధుల నివారణలో భాగస్వాములు కావాలని ఎంఎల్‌పి కోరారు. ప్రతి మంగళవారం, డ్రైడే, ప్రతి శుక్రవారం డ్రైడే నిల్వ నీటికి చెక్, దోమలకు బ్రేక్, ఆరోగ్యవంతమైన గ్రామమే మన లక్ష్యమని ఎంఎల్‌పి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు



**ప్రజాపక్షం/పాల్వంచ :** పచ్చని చెట్లు ప్రగతికి మెట్లని, మానవాళి మనుగడకు తోడ్పాటు నందిస్తాయని ఐఎఫ్‌ఎస్ విజిలెన్స్ శివయ్య అన్నారు.కిన్నెరసాని డివిజన్ చాతకొండ రేంజ్ పరిధి ఎర్రచెలక బీట్‌లో హరితాహారంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు చెట్లను నాటి సంరక్షించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ బి. బాబు, డిసిఎఫ్ కనకమ్మ, ఎఫ్ఆర్ఓ, బీట్ అధికారులు శోభన్, హనుమంతు, శ్యామ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 8న, రుద్రంపూర్ అథ్లెటిక్స్ ఎంపికలు

**ప్రజాపక్షం/పాల్వంచ :** జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8వ, తేదీ ఉదయం 8 గంటలకు రుద్రంపూర్ ప్రొఫెసర్‌జయశంకర్ గ్రౌండ్‌లో జిల్లా మిడిల్ అండ్ లాంగ్ డిస్టెన్స్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు జరుగనున్నాయని అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరి కే. మహీధర్ సోమవారం తెలిపారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 18న, మెదక్ ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగే తెలంగాణ రాష్ట్ర మిడిల్ అండ్ లాంగ్ డిస్టెన్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌కు ఎంపిక చేస్తామని చెప్పారు. అర్హులైన 14, 16, 18, 20 సంవత్సరాలలోపు బాల బాలికలకు 600, 800,1000,1500, 2000,3000, 5000, 10, 000 మీటర్లపరుగు పందెం నిర్వహిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ట్రెజరర్ హనుమంతరావు 7207402792 కు ఫోన్ చేసి తెలుసుకోవాలని సూచించారు.

# మైనింగ్ అధికారులూ.. మీ జాడ ఎక్కడ..?

**-అక్రమ మట్టి రవాణా జరుగుతున్నా పట్టించుకోని వైనం..**
**-అధికార పార్టీ నాయకుడి అండదండలతోనే రవాణా..?**
**-ప్రభుత్వ ఆదాయానికి గండి**





**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండలంలో అక్రమ మట్టి వ్యాపారం జోరుగా సాగుతున్నది. ముఖ్యంగా అనంతరం గ్రామ శివారు, నల్లబండబోడు గ్రామ పరిధిలోని సీతారామ ప్రాజెక్టు కాలువ మట్టి అర్ధ రాత్రుల్లో అక్రమ రవాణా జోరుగా మూడు పువ్వులు ఆరు కాయలుగా కోన సాగుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు. మండలంలో ఎమ్మెల్యే అనుచరుడిగా కొనసాగుతున్న ఓ రాజకీయ నాయకుడి అండ దండలతో మట్టి రవాణా జోరుగా సాగుతున్న పట్టించుకోవాల్సిన అధికారులు రాజకీయ వత్తిళ్ళతో అటువైపు కన్నెత్తి చూడటం లేదని విమర్శలు సైతం ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇందిరమ్మ ఇళ్ల కు మట్టి కొరత ఉందంటూ అర్ధరాత్రుల్లో మట్టి యదేచ్ఛగా రవాణా చేస్తున్న టాస్క్ ఫోర్స్, మైనింగ్, రెవెన్యూ అధికారుల జాడ కనిపించకపోవడం లేదనే విమర్శలు మండల వ్యాప్తంగా వినిపిస్తున్నాయి.

**ఇందిమ్మ ఇళ్ల పేరుతో అక్రమ మట్టి రవాణా..!**

పేదల సొంతిటి కలలను సాకారం చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించింది. దీనిలో భాగంగా లబ్ధిదారులకు విడతల వారిగా నగదును విడుదల చేస్తారు. దీనితో పాటు ఇళ్ల నిర్మాణానికి అవసరమైన మొరం, అవకాశంగా మార్చుకుని సొమ్ము చేసుకోవడానికి కొందరు అక్రమార్కులు ముందుంటున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరిట మట్టిని తోడేసుకుని సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతులు లేనప్పటికీ దగ్గరలోని సీతారామ కాలువ మట్టిని అక్రమంగా విక్రయిస్తూ తరలిస్తున్నారు. దీని వల్ల అసలైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మట్టి అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**అర్ధరాత్రి అడ్డగోలుగా తరలింపు..!**

నిబంధనల ప్రకారం మట్టిని ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే తవ్వాలి. కానీ జూలూరుపాడు మండలంలో అనంతారం రాత్రి సమయంలో యథేచ్ఛగా కాలువ మట్టిని, మార్కెట్ యాడ్ సమీప గుట్టల్లో మట్టిని రాత్రుల్లో దాటిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో రోడ్లపై వెళ్లే ట్రాక్టర్ల మోతతో అనంతారం గ్రామ ప్రజలకు కంటిమీద కునుకులేకుండా పోతున్నది. ట్రాక్టర్లు సుమారు 10 నుంచి 15 ట్రక్టర్లు, రెండు జేసీబీలు తో మట్టిని తరలిస్తున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా కిక్కురుమనకుండా ఉంటున్నారు. అర్ధరాత్రి ట్రాక్టర్ల పెద్దపెద్ద శబ్దాలతో జనం భయాందోళనలకు గురవుతున్నారు. ఓవర్‌లోడ్‌తో మట్టిని రవాణా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జూన్ 11 అర్ధరాత్రి కరెంటు స్తంభాలపై ట్రాక్టర్ దూసుకెళ్లడంతో డాక్టర్ డ్రైవర్ డ్రైవర్ గాయాలైన సంఘటనలు ఉన్నాయి. దీంతో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# చిరునోములలో జోరుగా అక్రమ మట్టి తోలకాలు..!

**-పంట పోలాలు దెబ్బతింటున్నాయని రైతుల ఆవేదన**
**-మైనింగ్, రెవెన్యూ శాఖలు చర్యలు చేపట్టాలి**



**ప్రజాపక్షం/బోనకల్:** మండలంలోని చిరునోముల గ్రామ పరిసర ప్రాంతాల్లో మట్టి తవ్వకాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి అనుమలు లేకుండానే అసైన్డ్ భూములతో పాటు వ్యవసాయ భూముల సమీపంలో భారీ యంత్రాలతో మట్టిని తవ్వి, టిప్పర్ల ద్వారా పెద్ద ఎత్తున ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు చెబుతున్నారు. సంబంధిత శాఖల అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించడంతో అక్రమ తవ్వకాలు మరింత పెచ్చరిల్లుతున్నాయని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. అక్రమ తవ్వకాల కారణంగా పంట పొలాలు దెబ్బతింటున్నాయని, భూముల సహజ స్వరూపం మారిపోతుందని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు, తరలింపులు జరుగుతున్నప్పటికీ మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు విన్పిస్తున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి గండి పటడంతో పాటు అక్రమ మట్టి రవాణా నిరంతరంగా కొనసాగుతోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాగం స్పందించి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలని, అక్రమ తవ్వకాలను తక్షణమే నిలిపివేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. స్థానికుల ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పందించి వాస్తవ పరిస్థితులను వెల్లడించాలని కోరుతున్నారు.

# ఎఐటియుసి పోరాట ఫలితం..

**సర్ఫస్ జనరల్ అసిస్టెంట్స్ వెబ్ కౌన్సిలింగ్ తాత్కాలికంగా నిలిపివేత**



**ప్రజాపక్షం/చుంచుపల్లి:** కొత్తగూడెం ఏరియాలో భూగర్భ గనుల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులతోనే సర్ఫస్ కన్వర్షన్ చేపట్టి, ఏరియాలో ఖాళీగా ఉన్న సర్ఫస్ జనరల్ అసిస్టెంట్స్ పోస్టులను భర్తీ చేయాలని గుర్తింపు సంఘం ఎఐటియుసి యాజమాన్యంపై నిరంతరం ఒత్తిడి తీసుకొచ్చింది. ఈ సందర్భంగా ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్ మాట్లాడుతూ ఈ సమస్యను ఎఐటియుసి గౌరవ అధ్యక్షులు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి భూగర్భ గని కార్మికులకు ఎలాంటి అన్యాయం జరగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఎఐటియుసి ఒత్తిడి ఫలితంగా ఈ నెల 8వ తేదీన నిర్వహించాల్సిన సర్ఫస్ జనరల్ అసిస్టెంట్స్ వెబ్ కౌన్సిలింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు యాజమాన్యం గుర్తింపు సంఘం ఎఐటియుసికి తెలిపిందన్నారు. అండర్‌గ్రౌండ్ కార్మికుల సర్ఫస్ కన్వర్షన్ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి మణుగూరు సర్ఫస్ జనరల్ అసిస్టెంట్స్‌తో సంబంధం లేకుండా ముఖ్యంగా పివికే5 భూగర్భ గనిలో విధులు నిర్వహిస్తున్న అర్హులైన కార్మికులకే తొలి ప్రాధాన్యత కల్పించాలని ఎఐటియుసి డిమాండ్ చేసింది. అదేవిధంగా సర్ఫస్ కన్వర్షన్ ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి, అర్హులైన కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి వి.మల్లికార్జున్ రావు, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, సహాయ కార్యదర్శి గట్టయ్య, ఆఫీస్ బేరర్ హుమాయూన్, నాయకులు లక్ష్మీ నారాయణ, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# మూడు దశాబ్దాల సేవలకు గుర్తింపు..!

**-అశ్వాపురం కాంగ్రెస్ పగ్గాలు ఓరుగంటి రమేష్‌కు**
**-కుటుంబ వారసత్వం, నిస్వార్ధ సేవ, ప్రజల విశ్వాసమే మండల అధ్యక్ష పదవికి బాట**





**ప్రజాపక్షం/అశ్వాపురం:** రాజకీయాల్లో పదవులు చాలా మందికి వస్తాయి. కానీ ప్రజల విశ్వాసం, పార్టీ నాయకత్వం నమ్మకం, కార్యకర్తల ఆదరణతో పదవి దక్కడం కొద్దిమందికే సాధ్యమవుతుంది. అలాంటి అరుదైన గుర్తింపునే అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఓరుగంటి రమేష్ అందుకున్నారు. దాదాపు మూడు దశాబ్దాలుగా ప్రజల మధ్య ఉంటూ, కాంగ్రెస్ సిద్ధాంతాలకు అండగా నిలబెట్టి సాగించిన రాజకీయ ప్రస్థానానికి ఈ పదవి ఓ మైలురాయిగా నిలిచిందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కాంగ్రెస్ కుటుంబ వారసత్వాన్ని కొనసాగిస్తూ, కాలానుగుణంగా రాజకీయ పరిణామాలు మారినా ప్రజలతో అనుబంధాన్ని కొనసాగించిన నాయకుడిగా రమేష్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాం నుంచి, ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు నాయకత్వంలో పార్టీ బలోపేతానికి కృషి చేసిన ఆయనకు ఇప్పుడు మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

**కాంగ్రెస్‌కు చిరునామాగా నిలిచిన ఓరుగంటి కుటుంబం....**

అశ్వాపురం రాజకీయ చరిత్రలో ఓరుగంటి కుటుంబం ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. కుటుంబ పెద్ద ఓరుగంటి వీరయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచే కాంగ్రెస్ పార్టీకి అంకితభావంతో పని చేసిన నాయకుడిగా గుర్తింపు పొందారు. పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా సిద్ధాంతాలను వీడకుండా కాంగ్రెస్ జెండాను భుజాన మోసిన నాయకుడిగా ప్రజల మన్ననలు పొందారు. అశ్వాపురం మండల కాంగ్రెస్ కార్యాలయానికి ఓరుగంటి వీరయ్య భవన్ అని పేరు పెట్టడం ఆ కుటుంబానికి కాంగ్రెస్‌తో ఉన్న అనుబంధానికి నేటికీ సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది.

**యూత్ కాంగ్రెస్ నుంచి మండల అధ్యక్షుడి వరకు....**

తండ్రి ఆశయాలను ఆదర్శంగా తీసుకున్న ఓరుగంటి రమేష్ యువకుడిగానే రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు పర్యాయాలు అశ్వాపురం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పని చేస్తూ యువతను పార్టీ వైపు ఆకర్షించారు. గ్రామ గ్రామాన ప్రజల సమస్యలు తెలుసుకుంటూ సేవా కార్యక్రమాల ద్వారా ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. రాజకీయ పరిణామాల నేపథ్యంలో కొంత కాలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో మండల అధ్యక్షుడిగా పని చేసిన ఆయన, అనంతరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు తర్వాత టీఆర్ఎస్‌లో సేవలందించారు. ఆ తరువాత తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు నాయకత్వంలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి కొనసాగించారు.

**పార్టీ విజయానికి కృషి..నాయకత్వానికి గుర్తింపు....**

ఇటీవల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి అశ్వాపురం మండలంలో అధిక మెజారిటీ సాధించేందుకు యువతను, కార్యకర్తలను సమన్వయం చేయడంలో ఓరుగంటి రమేష్ కీలకంగా వ్యవహరించారని పార్టీ నాయకులు చెబుతున్నారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడంలో ఆయన పాత్ర విశేషమని పేర్కొంటున్నారు. ఆయన సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

**పదవి కాదు...ప్రజా సేవే నాలక్ష్యం...**

నూతన బాధ్యతల సందర్భంగా ఓరుగంటి రమేష్ మాట్లాడుతూ పదవి ఉన్నా లేకపోయినా ప్రజలకు అందుబాటులో ఉండటం తన బాధ్యతగా భావించానన్నారు. తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి జీవితాంతం రుణపడి ఉంటానని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు ఆశయాలను అనుగుణంగా కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేస్తానని, కార్యకర్తలకు అండగా నిలుస్తానని, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం....**

ఓరుగంటి రమేష్ నియామకాన్ని కాంగ్రెస్ శ్రేణులు హర్షాతిరేకాలతో స్వాగతించాయి. మండలంలోని పలు గ్రామాల్లో కార్యకర్తలు శుభాకాంక్షలు తెలుపుతూ ఆనందం వ్యక్తం చేశారు. ఓరుగంటి వీరయ్య నిర్మించిన కాంగ్రెస్ వారసత్వాన్ని రమేష్ మరింత బలోపేతం చేస్తారని, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా ఆయనకు మంచి గుర్తింపు ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మూడు దశాబ్దాల రాజకీయ అనుభవం, ప్రజలతో మమేకమైన నాయకత్వం, పార్టీ పట్ల అంకితభావం కలిగిన ఓరుగంటి రమేష్ అశ్వాపురం కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తారనే ఆశాభావం కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. కొత్త బాధ్యతలతో ఆయన రాజకీయ ప్రస్థానం మరో కీలక మైలురాయిని చేరిందని పలువురు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# నమ్మి పని చేసిన వారిని గుర్తించరా...!

**-కూసుమంచి శివాలయ ఛైర్మన్ పదవి ఎవరికీ వరం**
**-సేవ చేసిన వారికా, సిఫార్సు చేసిన వారికా..?**



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలోని కూసుమంచి గ్రామంలో శివాలయ కమిటీ ఛైర్మన్ పదవి భర్తీ అంశం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ప్రజల సేవలో ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి పని చేసిన వారికి అవకాశం కల్పిస్తారా..?లేక అనేక సార్లు అనేక పదవులు అనుభవించి ఆర్ధికంగా బలపడి అధికారానికి దగ్గరగా ఉన్నవారికే మళ్లీ పదవులు కట్టబెడతారా? అనే ప్రజలు ప్రజల్లో వినిపిస్తున్నాయి.

**ప్రజలు ఎన్నో...సమాధానం చెప్పేది ఎవరు...!**

ప్రజల్ని నాయకత్వాన్ని నమ్ముకొన్ని అహర్నిశలు కష్టపడిన వారికి గుర్తింపు దక్కదా...?పదవులు ఎప్పుడూ కొందరికే పరిమితమా..?అట్టడుగు బీసీ వర్గాలకు ఛైర్మన్ పదవి దక్కే అవకాశం లేదా!, సేవ చేసిన వారిని పక్కన పెట్టి, సిఫార్సులు ఉన్న వారినే ఎంపిక చేస్తారా!, పారదర్శకంగా ఎంపిక చేస్తారా లేక తెరవెనుక నిర్ణయాలే జరుగుతాయా? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత సంబంధిత నిర్ణయాధికారులపైనే ఉందని కూసుమంచి గ్రామంలోని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రజా సేవ, అంకితభావం, నిజాయితీని ప్రమాణాలుగా తీసుకుని ఛైర్మన్‌ను ఎంపిక చేస్తే ఆలయ ప్రతిష్ఠ మరింత పెరుగుతుందని ప్రజలు, భక్తులు అంటున్నారు. సామాజిక సమానత్వానికి ప్రాధాన్యం ఇస్తూ అట్టడుగు వర్గాలకు కూడా అవకాశం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

**కూసుమంచి ప్రజలు ఏమంటున్నారు...**

చిత్తం శివుడి మీద భక్తి పదవి మీద అనే పద్ధతి కాకుండా పదవి అంటే హోదా మాత్రమే కాదు. భాధ్యత కూడా, సేవ చేసిన వారిని విస్మరించి, పదవులను ఒకే వర్గానికో, ఒకే వ్యక్తులకో అనేక పదవులు అనుభవించిన వారికో పరిమితం చేస్తే ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుంది. ఆలయ కమిటీ నియామకంలో పారదర్శకత, నిష్పక్షపాత ధోరణి కనిపించాలని మేము కోరుకుంటున్నామని పలువురు అభిప్రాయపడుతున్నారు. బీసీలో(ఆర్ధికంగా బలపడి కోట్లకు పడగలెత్తిన వారిని కాకుండా)అట్టగుడు వర్గాల్లో ఉన్నవారిని ఇప్పుడు గుర్తించకపోతే ఉన్న పుణ్యాకాలం కాస్త ముగిశాక ఏదో ఇస్తాం చేస్తామంటే ఒరిగేది ఏమీ ఉండదని అభిప్రాయం కూడా వ్యక్తం అవుతుంది. వెనకట సామెత చెప్పినట్లు చచ్చేదాకా ఉండు పెళ్లి చేస్తాననే పద్ధతుల్లో కాకుండా దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దే పద్ధతిలో నియమక నిర్ణయాధికారులు సరైన నిర్ణయాలు తీసుకుంటే బాగుంటుందని ఇంకా కూసుమంచిలో దేవుడు పేరుతో జరుగుతున్న రాజకీయ తథంగాన్ని ప్రజలందరూ నిశితంగా పరిశీలిస్తూ ఉన్నారు. ఈ ఫలితాలను బట్టి రాబోవు కాలంలో ప్రజలు సరైన రీతిలోనే స్పందిస్తారని తెలుస్తోంది.

## మహనీయుల విగ్రహాలను మళ్లీ ఏర్పాటు చేస్తాం



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం సెంటర్ డివైడర్‌పై తొలగించిన మహనీయుల విగ్రహాలను బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ అనుమతులతో అదే ప్రదేశంలో పునఃప్రతిష్ఠిస్తామని బీఆర్ఎస్ మండల యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ తెలిపారు. విగ్రహాలు తొలగించిన ప్రాంతాన్ని యువజన నాయకులతో కలిసి పరిశీలించిన ఆయన, విగ్రహాల తొలగింపు కొందరికి తాత్కాలిక ఆనందమేనని, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, ఎన్టీఆర్, వైస్ రాజశేఖర్‌రెడ్డి, దొడ్డి కొమరయ్య, చాకలి ఐలమ్మ, ప్రొఫెసర్ జయశంకర్, కాళోజీ, కొమురం భీం తదితర మహనీయుల విగ్రహాలను తిరిగి ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అధికారులు పక్షపాతం వీడి విగ్రహాల పునఃప్రతిష్ఠకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మండల యువజన నాయకులు నజీన్ షోను, మందా హుస్సేన్, బండ్ల కృష్ణ, ఊకె సతీష్, బేతం రాజకుమార్, పర్స సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## సీలింగ్ భూములను స్వాధీనం చేసుకున్న ఆదివాసీలు



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మండల పరిధిలోని దామరచర్ల గ్రామంలోని వివాస్పద సీలింగ్ భూములను ఆదివాసీలు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. సర్వే నెంబర్ 48లో గల 734(ఏడు ఎకరాల ముప్పై నాలుగు కుంటలు)భూమి తొలి విడతగా స్వాధీనం చేసుకున్నట్లు ఆదివాసీలు తెలిపారు. దామరచర్ల రెవెన్యూ పరిధిలో మొత్తం 130 ఎకరాల సీలింగ్ భూములకు నిజమైన హక్కుదారులు, నలభై మంది ఆదివాసీలు దశల వారీగా ప్రభుత్వ ఆదేశాల మేరకు, అధికారుల ఆర్డర్ల మేరకు మాకు ఉన్న హక్కుల మేరకు స్వాధీనం చేసుకుంటామని ఆదివాసీ రైతులు రాజిని వెంకటేశ్వరరావు, సిద్ధిని సీతరాములు, కాసిని రంగయ్య, పిట్టల పాపయ్య, పద్ధం ముత్యాలు, పిట్టిల ముత్తమ్మ, మలిపెద్ది బిందు, పిట్టల రాఘవులు, సాంబయ్య, కొర్రయ్య తెలిపారు.

## అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



**ప్రజాపక్షం/దమ్మపేట :** దమ్మపేట మండలం జమేదారు బంజర అటవీ ప్రాంతంలో మృతి చెందిన అనాథ మహిళకు గౌతమ బుద్ధ స్వచ్ఛంద సేవా సంస్థ సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులు ఎవరూ రాకపోవడంతో అనాథగా గుర్తించి సంస్థ సహాయం కోరారు. దీంతో మండలపల్లి పంచాయితీ కార్యదర్శి, పోలీసుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు పాలడుగుల అబ్బులు, షేక్ అజీమ్, రొయ్యల కుమార్, జేసీబీ సోము, తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ సమస్యల పరిష్కారానికి కృషి



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం :** ఏఐసీసీ కోఆర్డినేటర్, తెలంగాణ ప్రదేశ్ ఆదివాసీ ఇంచార్జ్ ఆలం సుష్మ సోమవారం పర్ణశాలలో శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శించుకుని, అనంతరం పెదబండి రేవు ఆదివాసీ గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులతో సమావేశమై ఆదివాసీల జీవన పరిస్థితులు, ఆచారాలు, విద్య, జీవో 3 అమలు, ఐటీడీఏ ఉద్యోగాలు, ఉపాధి, సబ్సిడీలు, సంక్షేమ పథకాలు, ప్రత్యేక నిధులపై చర్చించారు. ఆదివాసులకు రావాల్సిన హక్కులు, నిధుల అంశాలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో భద్రాచలం మార్కెట్ కమిటీ ఛైర్మన్ తెల్లం సీతమ్మ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తెల్లం హరికృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి పిలక వెంకటరమణారెడ్డి, జిల్లా నాయకుడు ఎండీ జిందా, మాజీ సర్పంచ్ తెల్లం వరలక్ష్మి , ఉప సర్పంచ్ వాగి శ్రీధర్, యూత్ ఉపాధ్యక్షుడు కారం నవీన్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆదివాసీ గ్రామస్తులు పాల్గొన్నారు.

## శివాలయ భూమి కబ్జాపై చర్యలు తీసుకోవాలి





**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలం లింగం బంజరలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంకు చెందిన 3.8 ఎకరాల భూమి కబ్జా అంశాన్ని ఆలయ ఛైర్మన్ పురం అంజయ్య జనసేన నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో జనసేన ఖమ్మం జిల్లా నాయకుడు మేడబోయిన కార్తీక్, ఖమ్మం టౌన్ కార్యదర్శి మహమ్మద్ ఫయాజ్, ఇల్లందు పట్టణ అధ్యక్షుడు మద్ది సాయికుమార్ ఆలయాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఆలయ ఛైర్మన్ పురం అంజయ్య మాట్లాడుతూ భూమి హద్దుల ఏర్పాటుకు దేవాదాయ శాఖ ఈవో నాలుగు రోజుల గడువు కోరారని తెలిపారు. గడువులోగా అధికారులు చర్యలు తీసుకోకపోతే జనసేన ద్వారా న్యాయం కోరుతామని చెప్పారు. ఈసందర్భంగా మేడబోయిన కార్తీక్ మాట్లాడుతూ దేవాలయ, రెవెన్యూ అధికారులు స్పందించకపోతే భూకబ్జాదారులపై జనసేన పోరాటం చేసి ఆలయ భూమిని కాపాడుతుందని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో బ్రహ్మం, బడుగుల శ్రీను, రాంబాబు, రామరాజు, జానీ, రంజాన్, గోపీనాథ్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు అందించిన సేవలు మరువలేనివి

**-పదవి విరమణ ఉద్యోగులను సన్మానించిన కలెక్టర్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బాధ్యతాయుతంగా ఉద్యోగ విధులు నిర్వహించి ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని అవి ఎప్పటికీ గుర్తుండిపోతాయని జిల్లా కలెక్టర్ దివాకర టివిస్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జూన్ 30న పదవి విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగుల సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టివిస్, అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై ఉద్యోగుల సేవలను కొనియాడారు. వివిధ శాఖలలో విధులు నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ సయ్యద్ యుసఫ్, తహసీల్దార్ ఎస్‌వి నారాయణమూర్తి, ఈఈ పి. సాయిరామ్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్. చంద్ర భగీరథ దేవి, ఆర్ఐ అల్లం రవి కుమార్, జూనియర్ అసిస్టెంట్ అయూబ్ ఖాన్, రికార్డు అసిస్టెంట్ కె. వెంకన్న, జూనియర్ అసిస్టెంట్ హసన్ పాషా, ఆఫీస్ సబార్డినేట్లు తేజావత్ పెంటయ్య, ఎం. సిద్దిఖ్ లు పదవి విరమణ పొందారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం ఒక బాధ్యతతో కూడుకున్నదని సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో అంకిత భావంతో సేవలు అందించిన ప్రతి ఉద్యోగి అభినందనీయుడన్నారు. విధి నిర్వహణలో ప్రజలకు అందించిన సేవలు గుర్తుండిపోతాయన్నారు. అనంతరం కలెక్టర్, అదనపు కలెక్టర్లు పదవి విరమణ పొందిన ఉద్యోగులకు జ్ఞాపికలు అందజేసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తు జీవితం ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, పదవి విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# హెల్త్ కార్డులు మంజూరు చేయాలి




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉద్యోగ, పెన్షనర్ల హెల్త్ కార్డులు ఈనెల 15లోగా మంజూరు చేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళన తప్పదని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు తెలిపారు. సోమవారం జరిగిన సమావేశంలో రాష్ట్ర నాయకులు వజ్జా శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం. సుబ్బయ్య, తాళ్లూరి వేణులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జేఏసితో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం జూలై 15 నాటికి ఎంప్లాయిస్ హెల్త్ స్కీం అమలు చేస్తామన్న హామీని అమలు చేయాలన్నారు. లేని పక్షంలో ఖమ్మం నుండి పెన్షనర్లు ఆందోళనకు సిద్ధంగా ఉన్నారన్నారు. పిఆర్‌సి ప్రయోజనాలు, డిఏలు ప్రకటించకుండా, హెల్త్ స్కీం ఉత్తర్వులు విడుదల చేయకుండా ఉద్యోగ, పెన్షనర్ల వేతనాల నుండి కొంత మొత్తాన్ని మినహాయించడం శోచనీయమన్నారు. పెన్షనర్లు, ఉద్యోగులు అనేక సమస్యలతో సతమతమవుతుంటే ప్రభుత్వం ప్రకటనలతో కాలయాపన చేస్తుందన్నారు. 2024 తర్వాత ఉద్యోగ విరమణ చేసిన వేలాది పెన్షనర్లకు నేటి వరకు పూర్తి ప్రయోజనాలు చెల్లించ లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగ, పెన్షనర్ల సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. హెల్త్ కార్డు జీవోను అమలు చేసి ఆసుపత్రుల లిస్టును వెంటనే ప్రకటించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. పూర్ణచందర్‌రావు, దుర్గాదేవి, సుగుణ, రాజేంద్రన్, జనార్ధన్, వెంకటనారాయణ, బసవ రాజు, రమేష్ పాల్గొన్నారు.

# 8వ రోజుకు చేరిన సింగరేణి అధికారుల రిలే నిరాహార దీక్షలు




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ (సిఎంఓఏఐ) సింగరేణి శాఖ ఆధ్వర్యంలో సత్తుపల్లి ఏరియాలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 8వ రోజుకు చేరుకున్నాయి. సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జనరల్ మేనేజర్ (జీఎం) కార్యాలయం ఎదుట అధికారులు శాంతియుతంగా ఆందోళన కొనసాగిస్తున్నారు. సోమవారం నిర్వహించిన దీక్షలో జి.వి.రావు (డీజీఎం ఐఈ అండ్ ఎం, కిస్టారం ఓసీపీ), కె. జగదీష్ (ఈఈఈ అండ్ ఎం, జేవీఆర్ ఓసీపీ), జి. శ్రీనివాస్ (ఈఈఈ అండ్ ఎం, జేవీఆర్ సీఎచ్‌పీ), మహ్మద్ జహీద్ (సీనియర్ యూఎం, జేవీఆర్ ఓసీపీ) పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు పే అప్‌గ్రేడేషన్ పి.ఆర్.పి మా హక్కు అనే నినాదాలతో తమ నిరసనను వ్యక్తం చేశారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎగ్జిక్యూటివ్ అధికారుల పే అప్‌గ్రేడేషన్‌ను తక్షణమే అమలు చేయాలని, అలాగే నిలిపివేసిన పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే (పి.ఆర్.పి) బకాయిలను ఎలాంటి జాప్యం లేకుండా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ సంస్థ అభివృద్ధి కోసం అధికారులు అంకితభావంతో పనిచేస్తున్నప్పటికీ, వారి న్యాయమైన సమస్యలను యాజమాన్యం నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఎస్‌సీసీఎల్ యాజమాన్యం, ప్రభుత్వం స్పందించి చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.దీక్షా శిబిరంలో అధికారులు జై సీఎంఓఏఐ.. జై జై సీఎంఓఏఐ అంటూ నినాదాలు చేస్తూ తమ ఐక్యతను చాటారు.

# 7వ వార్డులో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం

**- క్యూరింగ్ లేక ఎండిపోతున్న సీసీరోడ్డు**
**- నాణ్యతపై తలెత్తుతున్న ప్రశ్నలు**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 7వ వార్డులో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనుల్లో ఓ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ప్రజాధనం వృథా అవుతుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నగర అభివృద్ధి1 నిధుల కింద సుమారు రూ.18లక్షల వ్యయంతో 160మీటర్లకు పైగా నిర్మిస్తున్న సీసీరోడ్డు నాణ్యతపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీసీరోడ్డు నిర్మాణం అనంతరం తప్పనిసరిగా 14రోజుల పాటు నిరంతరంగా వాటర్ క్యూరింగ్ చేపట్టాల్సి ఉండగా, కాంట్రాక్టర్ మాత్రం తూతూ మంత్రంగా నీటిని చల్లి, పైపైగా పీచు వేసి వదిలేశాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. సరైన క్యూరింగ్ లేకపోవడంతో రోడ్డు వేగంగా ఎండిపోతూ పగుళ్లు ఏర్పడే ప్రమాదం ఉందని, దీంతో లక్షల రూపాయల ప్రజాధనం వృథా అయ్యే పరిస్థితి నెలకొన్నట్లు పేర్కొంటున్నారు. ఈ విషయంపై ఏఈ అప్పారావును ప్రజాపక్షం వివరణ కోరగా కాంట్రాక్టర్‌కు ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. వెంటనే వాటర్ క్యూరింగ్ చేపట్టించి, సీసీరోడ్డు నాణ్యత దెబ్బతినకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# ఎస్సైన్డ్ భూముల ఆక్రమణలను తొలగించండి

**-కలెక్టర్‌కు సిపిఐ వినతి**



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం కార్పొరేషన్ 12వ డివిజన్‌లో కొందరు సంపన్నులు, వ్యాపారవేత్తలు, ప్రభుత్వ ఉద్యోగులు ఎస్సైన్డ్ స్థలాలను ఆక్రమించి స్థిర నివాసాలు ఏర్పాటు చేసి అద్దెలకు ఇస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ మాట్లాడుతూ 12వ డివిజన్‌లో ఎస్సైన్డ్ కాలువలకు సంబంధించిన స్థలాలను ఆక్రమించుకుని దుకాణాలను ఏర్పాటు చేసి అద్దెలకు ఇస్తున్నారని తెలిపారు. గతంలో ఇదే ప్రాంతంలో పేదలు నివసిస్తుంటే న్యాయస్థానాల ద్వారా పేదలను వెళ్లగొట్టేందుకు ప్రయత్నం చేసిన వ్యక్తులే ఇప్పుడు ఆక్రమణలకు పాల్పడుతున్నారని గాంధీ తెలిపారు. కొందరైతే 58, 59 జీవోలను ఉపయోగించుకుని రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు దరఖాస్తు చేశారని వీటిని పరిశీలన చేసి తిరస్కరించాలని కోరారు. ప్రభుత్వ స్థలంలో గ్రీన్ పార్కును ఏర్పాటు చేయాలని ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఆముదాల వెంకన్న, జాకీర్, అక్రం, సత్యనారాయణ, రమణ, స్వామి, వెంకట్, ముత్తయ్య, సైదులు, భాస్కర్, అజయ్ పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించండి

**-కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయండి**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని ఏఐటియుసి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటియుసి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఆందోళనను ఉద్దేశించి ఏనుగు గాంధీ మాట్లాడుతూ పెరిగిన పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి మొదలైన ఇంధన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. పెరిగిన పెట్రోల్ ధరలతో ఆటో కార్మికులు బతకలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి రూ.12వేలు ఆటో కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం ఈ హామీని అమలు చేయకపోతే ఆందోళన తప్పదన్నారు. కార్పొరేట్ ఆన్‌లైన్ సర్వీసులను రద్దు చేయడంతో పాటు ఆటో కార్మికులకు ఉచిత ప్రమాద బీమాను వర్తింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు రావి శివరామకృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు జాకీర్, ఏఐటియుసి కార్మికులు పాల్గొన్నారు.

# ప్రియదర్శినిలో ఎజిఎల్ఇ ప్రోగ్రాం ప్రారంభం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాల(స్వయంప్రతిపత్తి)లో ఐబీఎం స్కిల్ బిల్డ్, టాస్క్ సంయుక్త ఆధ్వర్యంలో అడ్వాన్స్ గ్రాడ్యుయేట్ లెర్నింగ్ ఎక్స్పీరియన్స్ ప్రోగ్రాంను సోమవారం ఘనంగా ప్రారంభించారు. మూడురోజుల పాటు జరుగనున్న ఈ కార్యక్రమంలో నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు ఏఐ తదితర విషయాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. గోపాల్, డిస్ట్రిక్ట్ మేనేజర్ పి. దినేష్, ఎడ్యునెట్ ఫౌండేషన్‌కు మాస్టర్ ట్రైనర్ పి.అజయ్‌రెడ్డి, కళాశాల పలు విభాగాధిపతులు ఐ. నరసింహారావు, ఎం వెంకటేశ్వర్‌రావు, డి. రమేష్, తివారి, మన్మోహన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# రవికి జాతీయస్థాయి సాహిత్య పురస్కారం



**ప్రజాపక్షం/బోనకల్:** మండలంలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన కొమ్ము రవికి జాతీయ స్థాయి సాహిత్య పురస్కారం అందుకొని మండలానికి గర్వకారణంగా నిలిచాడు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆడిటోరియంలో శ్రీశ్రీ కళావేదిక, సవ్యసాచి గ్రూప్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 169వ అఖిల భారత ద్విశతాధిక కవి సమ్మేళనం కృష్ణవేణి కవితోత్సవంలో కొమ్ము రవి రచించిన ఐసీయూ కవితా సంకలనం జాతీయ స్థాయిలో ఎంపికైంది. ఈ సందర్భంగా నిర్వాహకులు కొమ్ము రవిని జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి కళారత్న కత్తిమండ ప్రతాప్ కుమార్, అధ్యక్షత వహించగా, జి ఈశ్వరిభూషణం, డాక్టర్ టి పార్థసారథి, కావూరి శ్రీనివాసశర్మ తదితరులు ప్రముఖులు పాల్గొని పురస్కారాన్ని అందజేశారు. కొమ్ము రవి సాధించిన ఈ జాతీయ స్థాయి గుర్తింపుపై సిపిఐ మండల నాయకులు, ముష్టికుంట్ల గ్రామస్థులు, సాహితి అభిమానులు అభినందనలు తెలిపారు.

# సర్వేపై రైతు అభ్యంతరం..తహసీల్దార్‌కు ఫిర్యాదు

**ప్రజాపక్షం/బోనకల్:** మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన రైతు కళ్యాణపు వాణికుమారి తన భూమిలో రైల్వే అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వకుండా సర్వే నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ సోమవారం తహసీల్దార్ సిహెచ్ సుధాకర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం తన పేరుతో తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన నూతన పట్టాదారు పాసు పుస్తకం నంబరు టి26010170305, సర్వే నంబరు 423లోని 9/1, 9/2,8లలో మొత్తం 5.08 ఎకరాల భూమి ఉందన్నారు. గతంలో మూడో రైల్వే ట్రాక్ నిర్మాణం కోసం ఈ భూమిలో సర్వే నిర్వహించి నష్టపరిహారం చెల్లించినప్పటికీ, ఎన్ఎస్పి కాలువ, ఫెన్సింగ్ రాళ్లకు సంబంధించిన నష్టపరిహారం ఇప్పటికీ అందలేదని తెలిపారు. ఇలాంటి పరిస్థితిలో అదే భూమిలో కొంత భాగాన్ని రైతులకు రోడ్డు ఏర్పాటు కోసం రైల్వే అధికారులు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సర్వేలు నిర్వహించడం సరికాదని, ఈ విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి తమకు తెలియజేయకుండా రోడ్డు వేయడం గానీ సర్వేలు చేయడం గానీ చేయవద్దని కోరారు. ఈ ఫిర్యాదుపై సంబంధిత రెవెన్యూ, రైల్వే అధికారులు స్పందించి రైతు అభ్యంతరాలు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# హాస్పిటల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

**- ఎఐటియుసి అదనపు ప్రధాన కార్యదర్శి రంగయ్య**



**ప్రజాపక్షం/మంచుపల్లి:** హాస్పిటల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎఐటియుసి అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య అన్నారు. సోమవారం కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్‌లో ఎఐటీయూసీ పిట్ సమావేశం పిట్ కార్యదర్శి అనంతలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఎఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్పిటల్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను సిఎంఓ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం గుర్తింపు సంఘః ఎఐటీయూసీ చిత్తశుద్ధితో కృషి చేస్తుందని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం, ఆసుపత్రిలో మెరుగైన పనివాతావరణం కల్పించడమే ఎఐటీయూసీ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాల ప్రభావంతో సింగరేణిపై పడుతున్న ఆర్థిక భారం, సంస్థ ఎదుర్కొంటున్న నష్టాలపై ఆయన వివరించారు. సింగరేణి పరిరక్షణకు కార్మికులంతా ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో హాస్పిటల్‌లో విధులు నిర్వహిస్తున్న నర్సులకు అదనపు వాష్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఇతర సమస్యలపై కూడా విస్తృతంగా చర్చించి, వాటి పరిష్కారం కోసం యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ ఉపాధ్యక్షులు కిష్టాఫర్, ఆసుపత్రి ఉద్యోగులు పాల్గొన్నారు.

# భద్రాచలంలో 8న 'టియుడబ్ల్యుజె' రాష్ట్రస్థాయి సెమినార్



**ప్రజాపక్షం/మణుగూరుః** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజేఐజేయూ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జూలై 8వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు భద్రాచలంలోని అక్షయ ఫంక్షన్ హాల్‌లో 'సోషల్ మీడియా ప్రభావం, బాధ్యతాయుత జర్నలిజం' అనే అంశంపై రాష్ట్రస్థాయి సెమినార్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి హాజరుకానున్నారు. అలాగే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు బి.వి. రమణారెడ్డి, జిల్లా ప్రజాప్రతినిధులు, కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏ పీవో రాహుల్ తదితర ఉన్నతాధికారులు పాల్గొననున్నారు.సెమినార్ అనంతరం జిల్లా, డివిజన్ కమిటీల నూతన కమిటీ ల ప్రమాణ స్వీకారం ఉంటుందని, ఈ మేధోమథన కార్యక్రమానికి పినపాక నియోజకవర్గ ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) పినపాక నియోజకవర్గ అధ్యక్షుడు పిండిగ వెంకట్, కార్యదర్శి బర్ల జోషి సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

## ప్రజా సమస్యలపై మెమోరాండం సమర్పించిన మద్దెల శివకుమార్ బృందం



**ప్రజాపక్షం/చుంచుపల్లిః** మండలంలోని పలు ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దెల శివకుమార్ ఆధ్వర్యంలోని బృందం తహశీల్దార్ కూచిపూడి నాగరాజుకు సోమవారం మెమోరాండం సమర్పించింది. ఈ సందర్భంగా మద్దెల శివకుమార్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ఓటరు నమోదు ప్రక్రియలో అక్రమాలకు తావులేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, మండల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మితమవుతున్న భారీ గృహాలు, ఆసుపత్రులపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, భూ ఆక్రమణలు, ల్యాండ్ మాఫియాను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులకు అవసరమైన ధృవపత్రాలను త్వరితగతిన అందిచాలని, గుడుంబా విక్రయాలు, డ్రగ్స్ సరఫరాపై కఠిన చర్యలు తీసుకోవాలని, సాదా బైనామా ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అర్హులకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. మెమోరాండంపై స్పందించిన తహశీల్దార్ కూచిపూడి నాగరాజు సమస్యలను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండా రమేష్, పి.సురేందర్, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి సల్మాన్ తోత, జిల్లా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మద్దెల ఆదర్శ్, కార్యదర్శి కేదాశి కిరణ్, సభ్యుడు సాయికుమార్, అటెండర్ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# 108 వాహన సేవలను సద్వినియోగించుకోండి



**ప్రజాపక్షం/గుండాల :** గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొదటి సోమవారం ఏఎన్‌సి పరీక్షల నిమిత్తం శెట్టిపల్లి సబ్‌సెంటర్ చెందిన గర్భిణి స్త్రీలను పరీక్షల అనంతరం జిల్లా 108 కోఆర్డినేటర్ సతీష్ సూచనల మేరకు వైద్యాదికారి రమేష్‌ఆధ్వర్యంలో మండల 108 సిబ్బందికి అవగాహణ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణిగా నమోదు చేయించుకున్న కాడినుండి వైద్యసేవల నిమిత్తం జివికె ఇఎంఆర్ఐ ద్వారా సేవలందిస్తున్న 108 మరియు102 లను సద్వినియోగం పరుచుకోవాలని సూచించారు. నెల నెల చెకప్ నిమిత్తం102 ద్వారా వచ్చి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. అలాగే స్కానింగ్ నిమిత్తం ఎరియా హాస్పిటల్ కి తీసుకెళ్లి పరీక్షలు చేయించి తిరిగి ఇంటివద్దకు చేర్చుతుందని తెలిపారు. ఎలాంటి అత్యవసర సమయాల్లోలైనా 108ను కాల్‌చేసి సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఎస్ రాజు, 108 సిబ్బంది ఎస్ ప్రవీన్, సాయి, విజయ, ప్రేమలత, 102 విజయ్ పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఆదివాసీ సమస్యాత్మక గిరిజన గ్రామాల్లో సీజనల్ వ్యాదుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, గర్భిణీలను గుర్తించి సరైన వైద్య పరీక్షలు అందించాలని ఏడిఎంహెచ్ఓ డా. సైదులు వైద్యసిబ్బందికి సూచించారు. సోమవారం ఐటిడిఏ కార్యాలయంలోని తన ఛాంబర్లో ఏజెన్సీ ఏరియాలలో పనిచేస్తున్న మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్ నర్సులతో గిరిజన గ్రామాల్లో ప్రబలే సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన కార్యాచరణ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ఉండే గర్భిణీలను సమీప పిహెచ్‌సీలకు తరలించాలన్నారు. గొత్తికోయ్ గ్రామాల్లో మలేరియా, డెంగీ కేసులు పెరగకుండా ఆరోగ్యశిబిరాలు నిర్వహించి అందరికీ వైద్య పరీక్షలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/కూసుమంచి:** పాల్వంచలో ఈనెల 18,19 తేదీల్లో జరిగే తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య 3వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ కూసుమంచిలో మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీర రామ్మూర్తి నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలోని గిరిజనులంతా అధిక సంఖ్యలో హాజరై తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. అనంతరం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ రాంబాబు మాట్లాడుతూ కూసుమంచిలో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యుడు బానోత్ భారత్, జిల్లా కార్యదర్శి బానోత్ జగన్, సీపీఐ మండల కార్యదర్శి భూక్యా నరసింహ, గిరిజన సమాఖ్య మండల అధ్యక్షుడు భూక్యా వీరన్న, సహాయ కార్యదర్శి భూక్య శ్రీకాంత్, భూక్యా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జగ్జీవన్‌రామ్ వర్ధంతి



**ప్రజాపక్షం/పాల్వంచ :** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి వేడుకలను ఆదివారం బస్టాండ్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలోని బడుగు బలహీన వర్గాల ప్రజలకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా సముచిత స్థానం ఇచ్చినపుడే ఆయన ఆత్మకు శాంతి చేకూరుతుందన్నారు. దేశంలో సమసమాజ స్థాపన కోసం జగ్జీవన్‌రామ్ చేసిన కృషి స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ డిప్యూటి మేయర్ సిరిపురపు లలితకుమారి, కార్పోరేటర్ కాల్వ భాస్కర్‌రావు, సీరపు సుగుణ, నాయకులు మహిపతి రామలింగం, బండి లక్ష్మణ్, వై. వెంకటేశ్వరరావు,బూసి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# బత్తుల ఆంజనేయులు గుండెపోటుతో మృతి

**సందర్శించి సంతాపం తెలిపిన సిపిఐ నాయకులు**



**ప్రజాపక్షం/మణుగూరుః** మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని బాపనుకుంట గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు బత్తుల ఆంజనేయులు సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలియగానే సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, సీపీఐ సహాయ కార్యదర్శి చింతల దశరథం, సీనియర్ నాయకులు ఎస్కే సర్వర్, ఏఐటీయూసీ కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, శాఖ కార్యదర్శి చల్లా కాంతారావు లు సందర్శించి ఎర్ర జెండా కప్పి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.ఆంజనేయులు అమర్ హై అంటూ పెద్ద ఎత్తుననినాదాలు చేసి గణం గానివాళులు అర్పించారు.

# అప్రకటిత కరెంటు కోతలు నిలిపివేయాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలంలో అప్రకటిత విద్యుత్ కోతలను వెంటనే నివారించాలని కోరుతూ సీపీఎం సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రజావాణిలో అధికారులకు వినతి పత్రం సమర్పించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, కే నరేంద్ర మాట్లాడుతూ ఉక్కపోత, దోమల బెడద, రైతులకు సాగునీటి ఇబ్బందులతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, చిన్న గాలి, వర్షానికే గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని విమర్శించారు. లైన్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉండటం, సిబ్బంది కొరత సమస్యలకు కారణమని పేర్కొంటూ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సీపీఎం డివిజన్ కమిటీ సభ్యుడు వజ్జ రామారావు, మాజీ సర్పంచ్ బానోత్ బన్సీలాల్, సీనియర్ నాయకుడు తలారి దేవప్రకాశ్, నాయకులు ఆదర్ల వినయ్ కుమార్, చిలుముల భరత్, జి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# నేడు శీతల పండుగను ఐక్యంగా జరుపుకుందాం



**ప్రజాపక్షం/కూసుమంచి:** దేశ వ్యాప్తంగా బంజారా సోదరీ, సోదరీమణులంతా నేడు(మంగళవారం)శీల పండుగను ఒకే రోజు సంప్రదాయబద్ధంగా, ఘనంగా నిర్వహించాలని లంబాడి ఐక్యవేదిక పాలేరు నియోజకవర్గ అధ్యక్షుడు వడిత్యా శోభన్ నాయక్ పిలుపునిచ్చారు. శీతల పండుగ బంజారా సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యతను ప్రతీక అని పేర్కొన్న ఆయన, ప్రతి తండా, గ్రామంలో శీతల మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించాలని కోరారు. యువత బంజారా వారసత్వాన్ని భావితరాలకు అందించాలని, సమాజ ఐక్యతతో పండుగను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలోని బంజారా ప్రజలందరికీ శీతల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, శీతల మాత ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు.

# అడవి ఒడిలో ఆధ్యాత్మిక వైభవం

**- విశేషంగా ఆకట్టుకుంటున్న మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం**






**ప్రజాపక్షం/తల్లాడ:** తెలంగాణ రాష్ట్రంలోని ములుగు జిల్లాలో అడవుల నడుమ వెలసిన మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోంది. ప్రకృతి అందాలు, ఆధ్యాత్మిక ప్రశాంతత, పురాతన చరిత్ర కలగలిసిన ఈ క్షేత్రం రోజు రోజుకూ భక్తుల రద్దీతో కళకళలాడుతోంది. మంగపేట మండలంలోని మల్లూరు గ్రామ సమీపంలో ఉన్న ఈ ఆలయం దట్టమైన అటవీప్రాంతంలో కొండపై వెలసి ఉంది. స్వామివారి దర్శనం కోసం తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, ఛత్తీశ్ఘడ్, మహారాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి స్వయంభువుగా వెలిశారని భక్తుల విశ్వాసం. స్వామివారి విగ్రహం ఉగ్ర నరసింహ రూపంలో దర్శనమివ్వడం ఈ ఆలయానికి ప్రత్యేక ఆకర్షణ. విగ్రహం నాభిభాగం మానవ చర్మంలా మృదువుగా ఉంటుందని, ఈ విశేషాన్ని చూసేందుకు అనేక మంది భక్తులు ఆసక్తి చూపుతుంటారు. ఇది భక్తుల్లో మరింత భక్తిశ్రద్ధలను పెంపొందిస్తోంది. ఆలయ ప్రాంగణంలో ఎత్తైన ధ్వజస్తంభం, ఉగ్ర ఆంజనేయ స్వామి విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఆలయం చుట్టూ పచ్చని అడవులు, కొండలు, ప్రకృతి ప్రేమికులను సైతం మంత్రముగ్ధులను చేస్తున్నాయి. వర్షాకాలంలో ఈ ప్రాంతం మరింత సుందరంగా మారుతుంది. పచ్చదనం, చల్లని వాతావరణం, సహజసిద్ధమైన జలధారలు, భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితోపాటు ప్రకృతి ఆనందాన్ని అందిస్తాయి. ప్రతీ సంవత్సరం నరసింహ జయంతి, బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. వేలాది మంది భక్తులు మొక్కులు చెల్లించుకుని స్వామివారి ఆశీస్సులు పొందుతారు. అన్నదాన కార్యక్ర



మాలు, హోమాలు, ప్రత్యేక అభిషేకాలు, కల్యాణోత్సవం వంటి కార్యక్రమాలు భక్తుల సమక్షంలో ఘనంగా జరుగుతాయి. అడవి మార్గంలో ప్రయాణించి ఆలయానికి చేరుకోవడం భక్తులకు ఒక ప్రత్యేక అనుభూతిని కలిగిస్తుంది. మార్గమంతా ప్రకృతి అందాలు దర్శనమిస్తాయి. ఈ క్షేత్రం ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా పర్యాటక ప్రాంతంగా కూడా గుర్తింపు పొందుతోంది. సెలవు దినాల్లో కుటుంబ సమేతంగా భక్తులు పెద్ద సంఖ్యలో సందర్శిస్తున్నారు. ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, విశ్రాంతి సదుపాయాలను మరింత విస్తరించాలని భక్తులు కోరుతున్నారు. ముఖ్య ఉత్సవాల సమయంలో అదనపు రవాణా సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. స్థానిక ప్రజల ఉపాధికి కూడా ఈ దేవస్థానం దోహదపడుతోంది. పూలు, పూజాసామాగ్రి, ప్రసాదాల విక్రయాలతో అనేక కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నారు. అటవీ ప్రాంతం కావడంతో భక్తులు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆలయ అధికారులు సూచిస్తున్నారు. భక్తులు క్రమశిక్షణతో దర్శనం చేసుకోవడం, అడవి నిబంధనలను పాటించడం ద్వారా ఈ పవిత్ర క్షేత్ర పరిరక్షణకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆధ్యాత్మిక, ప్రకృతి సౌందర్యం, ప్రశాంత వాతావరణం కలగలిసిన మల్లూరు శ్రీ హేమచల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా రోజు రోజుకూ మరింత ఖ్యాతిని సంపాదిస్తోంది. భక్తుల విశ్వాసం, ప్రకృతి వైభవం, పురాతన ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన ఈ ఆలయం భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెంది, దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు.

## రైతు ఆశీర్వాద సభా ఏర్పాట్ల పరిశీలన



**ప్రజాపక్షం/చింతకాని :** గత నెల 30న చింతకాని మండలం జగన్నాధపురంలో జరగాల్సిన రైతు ఆశీర్వాద భారీ వర్షాల నేపథ్యంలో వాయిదా పడిన నేపథ్యంలో సభ ఏర్పాట్లను సోమవారం జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర సీపీ సునిల్ దత్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సభా స్థలి నిర్వహణపై అధికారులు, స్థానిక నాయకులతో చర్చించారు. సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రదేశాల గురించి వివరాలు సేకరించారు. ఈ నివేదికను సీఎంవోకి నివేదిస్తామన్నారు. ఏర్పాట్లను వేగవంతం చేయాలని , సభ నిర్వహణ తేదీ ఎప్పుడు నిర్ణయించినా సిద్ధంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని అధికారులు, ఈవెంట్ మేనేజర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, వైరా ఏసీపీ సారంగపాణి, జిల్లా అధికారులు, చింతకాని తహసీల్దార్ బాబ్జీప్రసాద్, ఎంపీడీవో చుంచు శ్రీనివాసరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి, నాయకులు కొప్పుల గోవిందరావు, నాగార్జున , తాళ్లూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రూ. 352.24 కోట్లు రైతుల ఖాతాల్లో జమ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రైతు భరోసా పథకానికి సంబంధించి ఏడు ఎకరాల వరకు ఉన్న రైతులకు సోమవారం నిధులు జమ చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు 330377 మంది రైతులకు గాను రూ. 352.24 కోట్లు నిధులు జమ చేసినట్లు ఆయన తెలిపారు. సోమవారం ఏడు ఎకరాల వరకు ఉన్న రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేసినట్లు తెలిపారు. ఖమ్మం నియోజక వర్గంలో 18001 మంది రైతులకు రూ.20.10 కోట్లు, సత్తుపల్లి నియోజక వర్గంలో 82811 మంది రైతులకు రూ.87 .06 కోట్లు, పాలేరు 77578 మంది రైతులకు రూ. 77.64 కోట్లు, మధిర నియోజక వర్గంలో 87068 మంది రైతులకు రూ. 91.24 కోట్లు, వైరా నియోజక వర్గంలో 63710 మంది రైతులకు రూ. 75.13 కోట్లు, ఇల్లందు నియోజక వర్గంలో 1209 మంది రైతులకు రూ.1.06 కోట్లు నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.

## అంజనాపురంలో గ్రంథాలయం ప్రారంభం



**ప్రజాపక్షం/తల్లాడ:** మండల పరిధిలోని అంజనాపురం గ్రామానికి చెందిన కేతినేని బాబు జ్ఞాపకార్థం గ్రామంలో గ్రంథాలయ ఏర్పాటుకు సహకరించిన దాతల ఆధ్వర్యంలో సోమవారం తెదేపా రాష్ట్ర నాయకులు కేతినేని హరీశ్చంద్ర, సర్పంచి రాధాకృష్ణయ్య, ఉప సర్పంచి కేతినేని చలపతిరావు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ..గ్రంథాలయాలే దేవాలయాలని, ప్రతీ ఒక్కరూ గ్రంథాలయంలో దినపత్రికలు చూసే అలవాటు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చలపతిరావు, కిన్నెర వెంకటేశ్వరరావు, కేతినేని వీరరామారావు, కేతినేని వెంకటరామారావు, అనుముల రాంబాబు, చందా వెంకటేశ్వర్లు, భూక్యా బాబు, బంటి, భూక్యా వంశీ, అఖిల్ గోపి, అశోక్ చంద్రయ్య, నాగయ్య, తేజావత్ రాంబాబు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామ సమైక్య భవనానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/తల్లాడ:** మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామ పంచాయతీలో సర్పంచి కోడూరు ఉమాదేవి వీరకృష్ణ సోమవారం గ్రామ సమైక్య భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాష్ట్రంలో మహిళల అభ్యున్నతికి ఏర్పాటు చేసిన భవనం ఎంతోమంది మహిళలకు ఉపయోగకరంగా ఉంటుందని, గ్రామంలో ఉన్న పలు గ్రూపు మహిళా సభ్యులందరూ వినియోగించుకావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు కోడూరు వీరకృష్ణ, సీసీ భద్రమ్మ, ఉప సర్పంచి తోటపల్లి నాగలక్ష్మి కృష్ణ, వార్డు సభ్యులు కోడూరు దుర్గారావు, నాయకులు ఇశ్నేపల్లి వీరయ్య, బొగ్గుల పుల్లారెడ్డి, కోడూరు సత్యం, ఇస్నేపల్లి సుందర్‌రావు, ఇస్నేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజావాణి ద్వారా ప్రజలు అందించిన దరఖాస్తులను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన ప్రజల నుండి వినతులు స్వీకరించిన ఆయన ఆయా శాఖల అధికారులకు అందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు అధికారులపై ఉన్న నమ్మకంతో జిల్లా వ్యాప్తంగావచ్చిన దరఖాస్తులు సమర్పించారని, వాటిని ఆయా శాఖల అధికారులు పూర్తిగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పరిష్కారానికి నోచుకోని వాటిపై వెంటనే తగిన నివేదికలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఐటిడిఏలో :** ఐటిడిఏలోని సమావేశం మందిరంలో గిరిజన దర్బారు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పిఓ రాహుల్ గిరిజనుల నుండి విన్నపాలు స్వీకరించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ అర్హులైన ప్రతీ గిరిజనులకు ప్రభుత్వం సంక్షేమ ఫలాలు దశలవారీగా అందిస్తామని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో నివశించే వారు వానాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అందిన దరఖాస్తులను పరిశీలించిన ఆయన ఆయా శాఖల అధికారులకు బట్వాడా చేస్తూ సమస్యలు పరిష్కారమయ్యేందుకు కృషి చేయాలని, సమస్యలు ఉంటే వెంటనే వాటిపై నివేదికలు అందించాలన్నారు.

## డిగ్రీ ప్రథమ తరగతులు ప్రారంభం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ ప్రథమ సంవత్సరం తరగతులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయని ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డా॥ మహ్మద్ జాకీరుల్లా తెలిపారు. విద్యార్థులు తరగతులకు సకాలంలో క్రమం తప్పకుండా హాజరు కావాలని సూచించారు. హాజరు శాతం తగ్గకుండా ప్రతి ఒక్క విద్యార్థి చూసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

## భద్రాచలం నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యం

**ఎంపి పోరిక బలరామ్ నాయక్**



**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచల నియోజకవర్గ సమగ్రాభివృద్ధే తమ ఏకైక లక్ష్యమని మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరామ్ నాయక్ అన్నారు. సోమవారం స్థానిక ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి సాధిస్తామని, రాబోయే గోదావరి పుష్కరాలను ప్రణాళికా బద్ధంగా నిర్వహిస్తామని చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయడమే కాకుండా, పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఘాట్ల నిర్మాణం, రోడ్ల విస్తరణ, మౌళిక వసతుల కల్పనపై ఇప్పటి నుంచే ప్రత్యేక నిధులను కేటాయించి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. భద్రాచల పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులకు, స్థానిక ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నియోజకవర్గాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి భారీ నిధులు రాబట్టి సంయుక్తగా కృషి చేస్తామని చెప్పారు. అనంతరం ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ రాబోయే గోదావరి పుష్కరాల సందర్భంగా అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి క్యాంపు ఆఫీస్ లో నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరించేందుకు పాటుపడుతున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సర్పంచ్ పూనెం కృష్ణ దొర, వార్డుమెంబర్ బంబోతులు రాజీవ్, కాంగ్రెస్ నాయకులు రత్నం రమాకాంత్, భీమరవరపు వెంకటరెడ్డి, గాడి విజయ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగజ్జీవన్‌రామ్‌కి నివాళి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండల పార్టీ కాంగ్రేస్ కార్యాలయంలో పట్టణ కాంగ్రేస్ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు ఆధ్వర్యంలో భారత ఉప ప్రధాని స్వర్గీయ డాక్టర్ బాబు జగజ్జీవన్‌రామ్ 40వ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మాజీ మున్సిపల్ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మండల కాంగ్రేస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, డాక్టర్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, పమ్మి అశోక్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు శీలం చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ మోర్ శ్రీకాంత్, పట్టణ కాంగ్రేస్ నాయకులు వీరంశెట్టి సీతారాములు, ఫణితి శ్రీనివాసరావు, మిట్టపల్లి నాగి, దార్న రాజశేఖర్, పెద్దప్రోలు లక్ష్మయ్య, కర్నాటి హనుమంతరావు, పువ్వాళ్ళ రాము, చెరుకూరి కిరణ్, కన్నెగంటి నగేష్, జాలాది రామకృష్ణ, తేళ్లూరి వీరయ్య, ఆది ఆనందరావు, ఏదునూరి కోటయ్య, బత్తుల శ్రీను, బండారు నాగరాజు, కన్నెగంటి హుసేసన్, బొడ్డు కృష్ణ, నారపోగు రవి, కంభంపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.